
# ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా గట్టు కృతిక

- సీఎంఆర్ఐటీ వార్షికోత్సవంలో గోల్డ్ మెడల్ ప్రదానం



**ప్రజానావ, వేములవాడ:** హైదరాబాద్‌లోని ప్రముఖ విద్యాసంస్థ సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీఎంఆర్ఐటీ)లో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో నాలుగో సంవత్సరం విద్యార్థిని గట్టు కృతిక విశిష్ట గౌరవాన్ని అందుకున్నారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) ద్వారా గత నాలుగేళ్లుగా సమాజ సేవలో అందించిన సేవలను గుర్తిస్తూ ఆమెకు "ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డు"తో పాటు సామాజిక సేవ విభాగంలో గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని భారత్ ఎన్ఎస్ఎస్ అవార్డీ వంగపల్లి మణి సాయి వర్మ చేతులమీదుగా అందజేశారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, యువతలో సామాజిక బాధ్యతపై చైతన్యం కలిగించడంలో గట్టు కృతిక చూపిన అంకితభావాన్ని ఈ సందర్భంగా అభినందించారు. సీఎంఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపక చైర్మన్ సీహెచ్. మల్లారెడ్డి, సెక్రటరీ సీహెచ్. గోపాల్ రెడ్డి, సీఎంఆర్ఐటీ డైరెక్టర్ డా. ఎం. జంగా రెడ్డి, ప్రిన్సిపాల్ డా. వి. సత్యనారాయణ చేతుల మీదుగా సీఎంఆర్ఐటీ ఆడిటోరియంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని దేశాభివృద్ధికి తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. భవిష్యత్తులో భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత ముందుండాలని ఆకాంక్షించారు.

# పూణెలో ఆకస్మిక తుఫాను బీభత్సం

- ఒకరి మృతి, పలువురికి గాయాలు
- భారీ వర్షం, వడగళ్లతో నదులను తలపిస్తున్న రహదారులు
- ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



**ప్రజానావ, ముంబై:** పూణె నగరంలో గురువారం అకస్మాత్తుగా సంభవించిన తుఫాను, భారీ వర్షం తీవ్ర బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం వరకు మండుటెండను ఆస్వాదిస్తున్న పూణె వాసులు ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఉలిక్కిపడ్డారు. నగరం మొత్తం చీకటిలో మునిగిపోయినట్లుగా మారి, ఆకాశం బద్దలైనట్లుగా కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షం నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలను కూడా ప్రభావితం చేసింది. వడగళ్ల వానతో పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సింహగడ్ రోడ్‌లో చెట్టు కూలిపడటంతో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బలమైన గాలులు, ఉరుములతో నగరంలో భయానక వాతావరణం నెలకొంది. అనేక చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడటంతో రవాణా పూర్తిగా స్తంభించింది. జంగ్లీ మహారాజ్ రోడ్, స్వర్గేట్, వార్జే తదితర ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపై ఒకటి నుంచి రెండు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. రోడ్లు నదుల్లా మారడంతో కొన్ని చోట్ల వాహనాలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. మెరుపులతో కూడిన వర్షం కారణంగా నగరంలో వెలుతురు గణనీయంగా తగ్గిపోయి, పగటిపూటనే వాహనదారులు హెడ్‌లైట్లు వెలిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి కాలం కావడంతో గొడుగులు, రెయిన్‌కోట్లు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సింహగడ్ రోడ్, ధంకావాడి, కత్రజ్, హడప్సర్, లోహేగావ్, ఖరాడి, పింప్రి చించ్వాడ్ ప్రాంతాల్లో వర్షం, వడగళ్ల కారణంగా ఉష్ణోగ్రత తగ్గినప్పటికీ సాధారణ జనజీవనం స్తంభించింది. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, రాబోయే రెండు రోజులు నగరంలో మేఘావృత వాతావరణం కొనసాగుతూ, సాయంత్రం ఈదురు గాలులు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పూణెకు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. వర్ష సమయంలో చెట్ల కింద నిలబడవద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు పౌరులను అప్రమత్తం చేశారు. సోమవారం నుంచి అకాలంగా ప్రారంభమైన ఈ వర్షాలతో పూణె వాసులు వేసవిలోనే రుతుపవనాల ప్రారంభాన్ని అనుభవిస్తున్నారు.

## సిరిసిల్లలో 'సెస్' కొనసాగుతుందా.. లేదా?

# ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- విద్యుత్ వినియోగదారులు, సెస్ పాలకవర్గం కలిసి
- ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధం కావాలి
- కరీంనగర్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ పిలుపు
- సిరిసిల్ల తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ కొనసాగుతుందా లేదా ప్రభుత్వం స్పష్టం చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ నేరుగా ప్రశ్నించారు. సిరిసిల్ల సెస్ ను తెలంగాణ ఎన్పీడీసీఎల్ తమ ఆధీనంలోకి తీసుకొని సేవలు కొనసాగిస్తున్న నేపథ్యంలో కొనసాగుతున్న ఆందోళన నేపథ్యంలో గురువారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి వినోద్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల సెస్ లైసెన్స్ పునరుద్ధరణలో రాష్ట్ర ప్రభుత్వ ఆలస్యం రాజకీయంగా వేడెక్కిస్తోందని అన్నారు. మార్చి 31తో సెస్ లైసెన్స్ గడువు ముగిసినా ఇప్పటివరకు పునరుద్ధరణ జరగకపోవడంతో వినియోగదారుల్లో తీవ్ర గందరగోళం నెలకొందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సెస్ విషయంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సిరిసిల్ల పర్యటనతో సెస్ విలీనంపై అనుమానాలు మరింత పెరిగినట్టు వ్యాఖ్యలు చేశారు. సెస్‌ను ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. దాదాపు 56 ఏళ్ల చరిత్ర కలిగిన సెస్ సంస్థ సిరిసిల్ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేసిన వినోద్ కుమార్. పవర్‌లూమ్ పరిశ్రమ, వ్యవసాయ రంగాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తూ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు సెస్ వెన్నెముకగా నిలిచిందని వ్యాఖ్యానించారు. సెస్‌పై అవినీతి, నష్టాల ఆరోపణలను వినోద్ కుమార్ పూర్తిగా ఖండించారు. సెస్ నష్టాల్లో లేదు... రాష్ట్ర ప్రభుత్వమే సుమారు రూ.700 కోట్లు బకాయి ఉంది.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో పలువురు ముఖ్యమంత్రులు సెస్‌ను రద్దు చేయాలని ప్రయత్నించినా దాని ప్రాముఖ్యత గుర్తించి కొనసాగించినట్లు గుర్తు చేశారు. విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెంటనే స్పందించి సెస్ లైసెన్స్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎం తో మాట్లాడి సెస్ సహకార సంస్థను కాపాడాలని వినోద్ కుమార్ సూచించారు. అవసరమైతే వినియోగదారులు, సెస్ పాలకవర్గం కలిసి జేఏసీగా ఏర్పడి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల సెస్‌ను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి స్థాయిలో పోరాటం చేస్తుందని వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర మాజీ టీఎస్కాబ్ చైర్మన్ కొండూరి రవీంద్రరావు, వేములవాడ నిజయకవర్గం ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్మన్ జిందం కళ, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, పట్టణ కార్యదర్శి మ్యాన రవి, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# భూ వివాదంలో సోనాలి బెంద్రే దంపతులకు న్యాయ చిక్కులు

**వంశహక్కులు దాచిపెట్టి కొనుగోలు చేశారన్న ఆరోపణలు**

**మావల్ కోర్టులో కేసు నమోదు**

**ప్రజానావ, ముంబై:** పూణే జిల్లాలోని మావల్ తాలూకాలో జరిగిన భూ లావాదేవీ వివాదంలో బాలీవుడ్ నటి సోనాలి బెంద్రే, ఆమె భర్త గోల్డీ బెహల్‌పై న్యాయపరమైన వివాదం తలెత్తింది. ఉక్సాన్ గ్రామంలో సుమారు 30 గుంటల భూమి కొనుగోలులో నిబంధనలు ఉల్లంఘించి మోసానికి పాల్పడ్డారంటూ స్థానిక రైతు చంద్రకాంత్ షిండే వడ్గావ్ మావల్ కోర్టులో దావా వేశారు. మౌజే ఉక్సాన్‌లోని సర్వే నంబర్ 121/1 గల భూమిని పరస్పర అంగీకారంతో కొనుగోలు చేసినప్పటికీ, ఆ భూమి తమ కుటుంబానికి వంశపారంపర్యంగా చెందినదని ఫిర్యాదుదారు తరఫు న్యాయవాది వన్రాజ్ షిండే వాదించారు. 1957 నుంచి ఆ భూమి తమ తాత కేసు బాబాజీ షిండే పేరుపై ఉందని పేర్కొన్నారు. అసలు యజమాని వంశహక్కుల సమాచారాన్ని దాచిపెట్టి, భూమిని ముందుగా మరొకరికి అక్రమంగా విక్రయించి, అనంతరం సోనాలి బెంద్రే, గోల్డీ బెహల్‌కు అమ్మినట్లు ఆరోపించారు. 2025 డిసెంబర్‌లో స్థలాన్ని సందర్శించినప్పుడు తమతో వాగ్వాదం జరిగిందని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. సత్బారా రికార్డు లేదా కొనుగోలు పత్రం మాత్రమే యాజమాన్యానికి పూర్తి ఆధారం కాదని, వంశహక్కులను దాచిపెట్టారని వాదించారు. ఈ ఆరోపణలను ప్రతివాదులు ఖండించారు. వారి తరఫు న్యాయవాది రాజు షిండే ప్రకారం, ఆ భూమి సోనాలి బెంద్రే పేరుపై లేదని, ఆమెకు ఈ లావాదేవీతో ప్రత్యక్ష సంబంధం లేదని తెలిపారు. 1965 జూన్ 8న తహసీల్దార్ ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం కేసు షిండే ఆ భూమికి యజమాని కాదని కూడా పేర్కొన్నారు. ఈ వివాదం గతంలో తహసీల్దార్, సబ్-డివిజనల్ ఆఫీసర్ స్థాయిల్లో పలుమార్లు విచారణకు వెళ్లగా, ప్రతిసారి తీర్పు ఫిర్యాదుదారులకు వ్యతిరేకంగా వచ్చినట్లు డిఫెన్స్ వాదించింది. అక్టోబర్ 2025లో మావల్ తహసీల్దార్ కూడా ఫిర్యాదుదారుల అప్పీల్‌ను తిరస్కరించినట్లు తెలిపారు. కేవలం డబ్బు వసూలు చేయడానికే కేసును కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఈ కేసుపై కోర్టు తదుపరి విచారణలో ఎలాంటి తీర్పు ఇస్తుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## ఇసుక అనుమతులు అందక నిలిచిపోతున్న..

# ఇందిరమ్మ గృహా నిర్మాణాలు


**ఇల్లు మంజూరు అయ్యాక పెను బారంగా మారిన ధరలు**

**భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రాములు**



**ప్రజానావ, సిరిసిల్ల :** ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక అనుమతి కోసం తీసిన డి డి లు సైతం తిరిగి వెనక్కు ఇస్తున్నారని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కడారి రాములు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం సిరిసిల్ల సుభాష్ నగర్ లోని ఏఐటీయూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి, నిర్మానాలు ప్రారంభం అయినా తరువాత ఒక్క సారిగా ఇసుక, మొరం కు, కట్టు రౌతు కు రెండింతలు ధరలు పెరగడంతో గృహ నిర్మాణ దారులపై పెనుభారం పెరిగిందన్నారు. ఇసుక వారం లో ఒక రోజు రావడంతో కార్మికులకు ఉపాది లేకుండా పోయిందని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక ట్రాక్టర్ లు, టిప్పర్ లు కొన్న వారికి ఉపాది లేక ఫైనాన్స్ లు సైతం కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు, తక్షణమే ప్రతిరోజూ ఇసుక కు అనుమతి ఇచ్చి కార్మికులను, గృహ యాజమాన్యం ను ఆర్థిక భారం పడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, నాయకులు వడ్డెపెల్లి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి



**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిల్మ్ నగర్‌లో దుర్గా భవాని నగర్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే 25 వేల పారితోషికం

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**ప్రజానావ, సిరిసిల్ల :** రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను (గుడ్ సమారిటన్స్) ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "రహ్ వీర్ పథకం" ద్వారా రూ.25,000 లు నగదు పారితోషికం, ప్రశంసా పత్రం అందజేయబడుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రమాదం జరిగిన తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు. కానీ కొంతమంది పోలీస్ కేసులు ఉండొచ్చనే భయంతో గాయపడిన వారికి సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని ఈ భయాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం "రహ్ వీర్ పథకం"ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తుంది. సహాయం చేసిన వ్యక్తిపై ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యంలో భాగస్వామి కావాలని కోరారు.

## 108 అత్యవసర వైద్య సేవలు వెలకట్టలేనివి

**జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. బీ.ప్రవీణ్ కుమార్**

**సిరిసిల్ల జిల్లా ఆసుపత్రిలో జాతీయ 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ దినోత్సవం, కేక్ కట్**



**ప్రజానావ, సిరిసిల్ల :** 108 అత్యవసర వైద్య సేవలు వెల కట్టలేనివని, అత్యవసర సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలానికి వెళ్లి మొదటగా ప్రథమ చికిత్స చేసి గోల్డెన్ అవర్లో కీలక పాత్ర పోషించి ప్రాణాలు కాపాడే బాధ్యత 108 సిబ్బంది పై ఉందని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బి. ప్రవీణ్ కుమార్ అన్నారు. జాతీయ 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల దినోత్సవం సందర్భంగా గురువారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిండెంట్, అడిషనల్ డిఎంఈ డా. బి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని 108 సిబ్బందికి సూచించారు.. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్ కుమార్, ఆర్ఎంఓ డా. సుమన్,108 జిల్లా మేనేజర్ సవనపెల్లి అరుణ్ కుమార్,108 సిబ్బంది వడ్నాల అనిల్ కుమార్, బుర్ర స్వాతి, పోచంపల్లి పరశురాములు, బత్తుల రాజు, కొమిరిశెట్టి సతీష్ కుమార్, మంత్రి కిషోర్, అలుగొండ ప్రవీణ్, సాయి కృష్ణ, బరిగే లక్ష్మణ్, సిరిసిల్ల ప్రవీణ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్‌లో హనుమాన్ జయంతి



**ప్రజానావ, ఖైరతాబాద్:** హనుమాన్ జయంతి సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్ లైబ్రరీ చౌరస్తా బడా గణేశ్ వద్ద బజరంగ్ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, ఖైరతాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పీ. విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయారెడ్డి హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు బెల్లం పానీయాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ సిఫార్సులపై సమగ్ర చర్చ జరగాలి

- పీఆర్సీ నివేదిక తెప్పించుకుని అమలు చేయాలి
- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్
- సిరిసిల్లలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం




**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ రిపోర్టు పైన సమగ్ర చర్చ జరపాలని, ప్రభుత్వ విద్యా రంగానికి నష్టం కలిగించే అంశాలను, ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగించే అంశాలను తిరస్కరించి, విద్యాభివృద్ధికి దోహదపడే అంశాలను అమలుచేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. టిఎస్ యుటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ సమావేశం గురువారం స్థానిక గీతానగర్ హైస్కూలులో జి మహేందర్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో చావ రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రిపోర్ట్ పైన ఉపాధ్యాయ సంఘాలు, విద్యా రంగ నిపుణులతో చర్చించకుండా, కనీసం అసెంబ్లీలో చర్చకు పెట్టకుండా ఏకపక్షంగా అమలు చేయాలని నిర్ణయించడం సరైంది కాదని ఆయన అన్నారు. కనీసం గ్రామ పంచాయతీకి ఒక పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా అభివృద్ధి చేయాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని అందుకనుగుణంగా జిఓ 25 ను సవరించాలని కోరారు. మరో ముఖ్య అతిథి టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లు తెలంగాణ రెండో పీఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం పీఆర్సీ గడువు పొడిగించకుండా, వెంటనే నివేదిక తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, బకాయి ఉన్న నాలుగు వాయిదాల డిఎ లను ప్రకటించాలని, ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను రూపొందించి పర్యవేక్షణ అధికారుల పదోన్నతులు చేపట్టాలని కోరుతూ ఉద్యోగుల జెఎసి నాయకత్వంలో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, 2003 డిఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని, కెజిబివి, సమగ్ర శిక్షా ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, మోడల్ స్కూల్స్, గురుకులాల ఉద్యోగులకు 010, హెల్త్ కార్డులు అమలు చేయాలని తదితర తీర్మానాలను సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, జిల్లా నాయకులు అంబటి రమేశ్, శివకుమార్, స్వామిగౌడ్, ప్రవీణ్, లక్ష్మణ్, సురేష్, శ్రీనివాస్, తిరుపతి జాదవ్, సంతోష్, నరేశ్, అరవింద్, సత్తయ్య, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిధులు ఇవ్వకున్నా.. మున్సిపల్ నిధులతోనే ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాం

**మూడో వార్డుసభలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి**




**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు రాకపోయినా మున్సిపల్ నిధులతో పట్టణంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించి ఉంటే మరింత మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉండేదని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. గురువారం స్థానిక 3వ వార్డులో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి నివేదిక కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన వార్డు సభా కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథి, అలాగే ఆర్డీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిందం కళ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేలా ఈ వార్డు సభలను నిర్వహించడం స్వాగతించాల్సిన విషయమే కానీ ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు పరచక పోవడం వల్ల ప్రజలుకు వారు అనుకున్న సంక్షేమ ఫలాలలు అందకపోవడం బాధాకరమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో వార్డులలో ఉన్న ఇంద్రమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేశారు కానీ ఇప్పుడు ప్రతి వార్డులో ప్రజలచే ఎన్నుకోబడిన కౌన్సిలర్లు ఉన్నారు కనుక ఎలాంటి లోటు పాట్లు జరగకుండ పారదర్శకంగా నిజమైన అర్హులకు ఈ పథకం ద్వారా న్యాయం జరిగేలా లబ్ధిదారుల ఎంపికలో ప్రజా ప్రతినిధులుగా కౌన్సిలర్ పాత్ర క్రియాశీలకంగా ఉండేలా అధికారులు చూడాలని, ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగాలని అన్నారు. అలాగే మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం ఇస్తున్న ఈ పథకాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు పరచాలని, మహిళలకు 2500 రూపాయలను, కల్యాణ లక్ష్మి లో భాగంగా ఇస్తామన్న తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రభుత్వం ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలను ప్రతి సంవత్సరం పంపిణీ చేయడం జరిగిందని, ఈ ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి రెండు సంవత్సరాలు దాటిపోతున్న ఇంద్రమ్మ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో చేపట్టడం లేదన్నారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేస్తూ పారదర్శకంగా ఉత్తమ సేవలందిస్తూ ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా కొనసాగుతున్నదని, ఈ సంస్థను ను రద్దు చేయడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయి ఈ ప్రాంతం అభివృద్ధికి నష్టం జరిగే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం ఈ సంస్థను విలీనం చేయకుండ సంస్థను కొనసాగిస్తూ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనివ్వాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి ఆధ్వర్యంలో వార్డు ప్రజలందరూ తీర్మానం చేసి ఈ వార్డు సభ ద్వారా ప్రభుత్వానికి పంపించాలని తీర్మానాన్ని ఆర్డీవో కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదిర్ ఫాషా, ఏఎంసి చైర్మన్ వెల్ముల స్వరూప తిరుపతి రెడ్డి, ఏఈ నరసింహస్వామి, వార్డు ఆఫీసర్ ప్రవీణ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సామాన్యుడు ఇల్లు కట్టుకొని సంతోషంగా.. జీవించాలన్నదే ప్రభుత్వ ఆలోచన

**ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు**



**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇల్లు సామాన్యుడు కట్టుకొని సంతోషంగా జీవించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేసిందని సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట 12 వార్డులో చందా వాణి రాజు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా దంపతులకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు సూర దేవరాజు నిర్మల నూతన వస్త్రాలను అందజేశారు. గృహప్రవేశం కార్యక్రమంలో సూర దేవరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇల్లు ఇచ్చి సామాన్యుడి కళ్ళల్లో ఆనందాన్ని చూడాలన్నది ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదన్నారు. త్వరలో మళ్లీ ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూనె శీను, గుడిసెట్టి బాలరాజు, కత్తెరపాక ఎల్లయ్య, సద్దుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




# రేషన్ కార్డుదారులకు రూ.5 లక్షల జీవిత బీమా

■ జూన్ 2 నుంచి పథకాన్ని అమలు చేస్తాం ■ గ్రామాల్లో మిగిలిన సమస్యలను గుర్తించి పరిష్కరిస్తాం ■ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ప్రజానావ, సిరిసిల్ల:** రేషన్ కార్డు ఉన్న సుమారు 1.15 కోట్ల లబ్ధిదారులకు రూ.5 లక్షల జీవిత బీమా పథకాన్ని జూన్ 2 నుంచి ప్రభుత్వం అమలు చేయనున్నట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంతో పాటు వేములవాడ పట్టణంలోని 25వ వార్డులో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. గ్రామ సభల ద్వారా మిగిలిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేస్తున్నారని, దేశంలో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా నిలిపే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రైతులకు ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. గతంలో రేషన్ కార్డులు ఇవ్వకపోయినా ప్రస్తుతం నూతన కార్డుల జారీ కొనసాగుతోందని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని చెప్పారు.



**అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు**

రాష్ట్రవ్యాప్తంగా రూ.14,600 కోట్లతో సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇందిరమ్మ రాజ్యంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నం వడ్లకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ అర్హులందరికీ ఇళ్లు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల పరంగా చెక్కపల్లి కంచు కుంటలోకి రెండు రోజుల్లో నీటిని విడుదల చేస్తామని, చెక్కపల్లి-వట్టేంల రహదారి నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేసి త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో పూర్తికాని పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## వీ-హబ్ కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

■ పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజానావ, పెద్దపల్లి:** జిల్లాలోని వీ-హబ్ నైపుణ్యాల శిక్షణా కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. గురువారం నిర్వహించిన టీఓటీ ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, స్వశక్తి సంఘాల మహిళలకు వ్యాపార నైపుణ్యాలను మెలకువలను వివరించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మహిళలకు రుణాల సాధన, ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెటింగ్ అంశాలపై శిక్షణ ఇస్తున్నామని, ఇప్పటికే వ్యాపారం చేస్తున్న వారు కూడా విస్తరణకు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని వీ-హబ్ కేంద్రం ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## శాయంపేట గ్రామాభివృద్ధికి సురేందర్ రావు కృషి ప్రశంసనీయం

■ పారిశుద్ధం, మౌలిక వసతుల్లో మిగతా గ్రామాలకు శాయంపేట ఆదర్శం
■ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో జిల్లా హౌసింగ్ పీడీ శ్రీనివాస్



**ప్రజానావ, జమ్మికుంట:** ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారంతో పాటు గ్రామ అభివృద్ధిని ధ్యేయంగా తీసుకుని శాయంపేట సర్పంచ్ సురేందర్ రావు సమర్థంగా పనిచేస్తున్నారని జిల్లా హౌసింగ్ పీడీ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జమ్మికుంట మండలంలోని శాయంపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులు పాల్గొని గ్రామ అభివృద్ధిని పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. 99 రోజుల పరిపాలనా కాలంలో సర్పంచ్‌గా సురేందర్ రావు గ్రామాన్ని పారిశుద్ధంగా ఉంచడంలో విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు ద్వారా రాత్రి వేళ ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించడం ద్వారా ప్రజలకు ఉపశమనం కల్పించారని స్థానికులు అధికారులకు వివరించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సురేందర్ రావు మాట్లాడుతూ, గ్రామ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నానని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలో 16 గృహాలు పూర్తయ్యాయని, గృహజ్యోతి పథకం సుమారు 200 ఇళ్లకు వర్తిస్తోందని చెప్పారు. గ్రామ సెక్రటరీ ఝాన్సీ రాణి మాట్లాడుతూ, శాయంపేట గ్రామం అభివృద్ధి, స్వచ్ఛత, పారిశుద్ధ్య అంశాల్లో మండలంలోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ అభివృద్ధికి సహకరించిన సర్పంచ్ సురేందర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డా. లింగారెడ్డి, ఎంపీడీవో పద్మావతి, ఎంఈవో హేమలత, ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

■ నిందితులపై సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల జిల్లాల్లో కేసులు ■ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ నాగేశ్వరరావు

**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల రూరల్ సర్కిల్ పరిధిలోని ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను గురువారం అరెస్టు చేసి, వీరిని రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వరరావు మీడియా సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. పట్టుబడిన నిందితుల నుంచి రెండు తులాల బంగారు ఆభరణాలు 11 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అరెస్టయిన వారిలో చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ పాషా (21), చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన పిట్టల అరవింద్ (20), వేములవాడ మండలం సుభాష్ నగర్‌కు చెందిన సామల బాలకిషన్ (20) ఉన్నారు. ఈ సందర్భంగా సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ తంగళ్లపల్లి మండలం తాడూరి గ్రామానికి చెందిన సాసాల లక్ష్మి అనే మహిళ తన ఇంటికి తాళం వేసి తన కూతురు వద్దకు వెళ్లగా గత నెల 30న తెల్లవారుజామున ఎవరో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న సుమారు రెండు తులాల బంగారు,11 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ. 3వేల నగదును దోచుకెళ్లారని సాసాల లక్ష్మి తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఉపేంద్ర చారి కేసు నమోదు చేసి స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టగా సాంకేతికత ఆధారంగా నిందితులు చందుర్తి మండలం జోగపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ అజ్గర్ పాషా, చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన పిట్టల రవీందర్, వేములవాడ మండలం సుభాష్ నగర్‌కు చెందిన సామల బాలకిషన్‌గా గుర్తించి, మండపెల్లి గ్రామ శివారులో పట్టుకొని విచారించారు. వీరి వద్ద బంగారు, వెండి అభరణాలను స్వాధీనం చేసుకొని గురువారం రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. నిందితులపై వివిధ జిల్లాల్లో నమోదైన కేసుల వివరాలను వెల్లడించారు. మహమ్మద్ అజ్గర్ పాషా సిరిసిల్ల జిల్లాలో 21 దొంగతనం కేసుల్లో నిందితుడని, పిట్ల అరవింద్ కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో 8 దొంగతనం కేసుల్లో నిందితుడని, బాలకిషన్‌పై సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో 6 కేసులు ఉన్నాయని తెలిపారు. చాకచక్యంగా కేసును ఛేదించిన సిబ్బందిని సీఐ అభినందించారు.




## అగ్రహారం ఆలయంలో ఎస్పీ పూజలు

**ప్రజానావ, సిరిసిల్ల:** చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా అగ్రహారంలోని హనుమాన్ దేవాలయంలో ఎస్పీ మహేశ్ బీ గితే గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ సీఐ వీరప్రసాద్, ఆర్ఐ సురేశ్, ఏఎస్ఐ రాజు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరకట్న హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

**భర్తతో పాటు మరో ఇద్దరికి శిక్ష**

**నేరం చేసిన వారెవరూ తప్పించుకోలేరు: ఎస్పీ**



**ప్రజానావ, సిరిసిల్ల:** రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల హత్య కేసులో భర్తతో పాటు మరో ఇద్దరికి సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ జీవిత ఖైదు విధించారు. ప్రతి నిందితుడికి రూ.2,000 జరిమానా కూడా విధించినట్లు జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రుద్రంగి గ్రామానికి చెందిన హేమలతను అదే గ్రామానికి చెందిన సింగారపు జనార్ధన్‌తో కట్నం ఇచ్చి వివాహం చేశారు. వివాహం అనంతరం అదనపు కట్నం కోసం జనార్ధన్, అతని కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేశారు. ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినప్పటికీ వేధింపులు ఆగలేదు. ఏప్రిల్ 3న మళ్లీ కట్నం కోసం గొడవ జరిగి, జనార్ధన్‌తో పాటు శారద, సాగర్ కలిసి హేమలతను రోకలి బండతో తలపై కొట్టి హత్య చేసినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనపై మృతురాలి తమ్ముడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విచారణలో ప్రాసిక్యూషన్ తరఫున 19 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో నాలుగో నిందితురాలు మైనర్ కావడంతో ఆమెపై కేసు జువినల్ కోర్టులో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని, పోలీసు--ప్రాసిక్యూషన్ సమన్వయంతో నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసు విచారణలో కృషి చేసిన ప్రజా అభియోగాధికారి పెంట శ్రీనివాస్, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందిని అభినందించారు.



## రామ నామస్మరణతో మార్మోగిన కొండగట్టు

**వేలాదిగా తరలివచ్చిన దీక్షాపరులు**

**ప్రజానావ, జగిత్యాల:** భక్తులు, హనుమాన్ దీక్ష స్వాములతో కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం పోటెత్తింది. గురువారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా వేలాదిమంది దీక్ష స్వాములు కొండపైకి కాలినడకన వెళ్లి స్వామిని దర్శించుకొని మాల విరమణ చేశారు. దీంతో కొండపై హనుమాన్ దీక్ష స్వాముల రామ నామ స్మరణతో మార్మోగింది. వివిధ జిల్లాల నుంచి స్వాములు కాలినడకన వచ్చి స్వామి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొండగట్టు చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

## ఎవరి వద్ద రూపాయి ఆశించలేదు: కడియం

**ప్రజానావ, వరంగల్:** 32ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరి వద్ద ఒక్క రూపాయి కూడా ఆశించలేదని, నాపై నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అవినీతి, అక్రమాలు లేని నిజాయితీతో కూడిన పాలన అందించడమే ఏకైక లక్ష్యమని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్‌గూడ్ మండలం ఉప్పుగల్ గ్రామం, స్టేషన్ ఘనపూర్ మండలం పామునూరు గ్రామాల్లో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభలకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.

Published and Editor Owned by **Adula Thirupathi,** and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. **Phone No: 99484 33277.**